# 1000 కోట్ల జీఎస్టీ కుంభకోణం!

- జంటనగరాల్లో 51 కంపెనీల్లో ఐటీసీ మోసాలు
- మోసపూరిత వ్యవహారాల్లో ఐఐటీ హైదరాబాద్ పాత్ర
- మోసాలపై దర్యాప్తు చేపట్టిన వాణిజ్యపన్నుల శాఖ

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): జీఎస్టీ రిఫండ్స్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కేసుల్లో సుమారు రూ.1000 కోట్ల కుంభకోణం జరిగినట్టు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. ఇంతకన్నా ఎక్కువ మొత్తంలో మోసం జరిగి ఉంటుందని, ఇది పూర్తిస్థాయి దర్యాప్తులో బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దాదాపు డజన్ వరకూ కంపెనీలు మోసపూరిత రిఫండ్‌లకు పాల్పడినట్టు తేలగా, జంటనగరాల్లోని మరో 51 కంపెనీల్లో ఐటీసీ మోసాలకు సంబంధించిన దర్యాప్తు వివిధ దశల్లో ఉన్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. విచారణలో ఉన్న ఈ 51 కేసులకు సంబంధించి మొత్తం టర్నోవర్ రూ.5,893 కోట్లు కాగా, ఇందులో ప్రభుత్వానికి రావాల్సిన పన్ను రూ.976 కోట్లు, అన్నీ కలిపుకొని సుమారు రూ.1000 కోట్ల వరకు కుంభకోణం జరిగినట్టు భావిస్తున్నారు. కొన్ని కంపెనీలు అంతర్రాష్ట్ర లావాదేవీలకు సంబంధించి జీఎస్టీ ఆర్-1 రూపంలో నెలవారీ రిటర్న్స్ ఫైల్ చేస్తూ ఇతర రాష్ట్రాల్లో పన్ను చెల్లింపుదారులకు ఐటీసీని బదిలీ చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే, పలు కంపెనీలు లోకల్ సేల్స్‌తో పాటు అంతర్రాష్ట్ర సేల్స్‌లో మోసపూరితంగా జీరో టర్నోవర్ కింద జీఎస్టీఆర్-3బీ ఫైల్ చేస్తూ పన్నులు ఎగ్గొడుతున్నాయని చెప్పారు. మరికొన్ని కంపెనీలు పన్ను చెల్లించకుండానే ఇతర పన్ను చెల్లింపుదారులకు ఐటీసీని బదిలీచేస్తున్నాయని, దీని వల్ల ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతున్నదని తెలిపారు. పన్ను చెల్లించకుండా ఇతరులకు ఇన్‌పుట్ క్రెడిట్ క్లెయిమ్‌లకు వీలు కల్పించారని, వాస్తవంగా చెల్లించాల్సిన పన్నును తగ్గించి చూపారని, దీనివల్ల రెండు విధాలుగా ఖజానాకు నష్టం జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

### ఐఐటీహెచ్ పాత్ర

వాణిజ్య పన్నుల శాఖకు ఐటీ సహకారం అందిస్తున్న ఐఐటీ-హైదరాబాద్ పాత్ర కూడా ఇందులో ఉన్నట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి. మొత్తం డాటాను ఐఐటీహెచ్ నిర్వహిస్తున్నదని, అయినా వారు ఇటువంటి మోసపూరిత వ్యవహారాలను తమ దృష్టికి తేలేదని అధికారులు పేర్కొంటున్నారు. ఐఐటీహెచ్ పాత్రపై కూడా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతున్నదని వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి తెలిపారు. మరోవైపు, జీఎస్టీ పన్నుల కుంభకోణంలో ఐఐటీహెచ్ పాత్ర ఉన్నట్లు వచ్చిన వార్తలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన కేంద్ర విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు.

## అనుమతి లేనిదే హైదరాబాద్ ఆఫీసుకు రావద్దు

సోషల్ వెల్ఫేర్ గురుకుల సిబ్బందికి సెక్రటరీ ఆదేశాలు

హైదరాబాద్, మార్చి13 (నమస్తే తెలంగాణ): ముందస్తు అనుమతి లేనిదే తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు హైదరాబాద్‌లోని సొసైటీ ప్రధాన కార్యాలయానికి రావద్దని హెచ్చరిస్తూ విద్యాలయాల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేశారు. సొసైటీ ప్రధాన కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్ ముందస్తు అనుమతి పొందాలని, ప్రిన్సిపాల్ నుంచి సెలవు మంజూరు ఉండాలని, కార్యాలయానికి ఎందుకు వస్తున్నదీ అనే విషయాన్ని కార్యాలయ ప్రవేశద్వారం వద్ద ఉంచిన సందర్శకుల రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేసి సంతకం చేయాలని ఆమె ఆదేశించారు. సెక్రటరీ హెడ్ ఆఫీస్‌లో లేకుంటే అదనపు కార్యదర్శిని కలవాలని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షలు, పాఠశాల పనిదినాల్లో కూడా కొందరు ఉద్యోగులు సొసైటీ ప్రధాన కార్యాలయానికి వచ్చి చికాకు పెడుతున్నారని, విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో జరిగే సాధారణ సమావేశాలకు ఎప్పటికప్పుడు ఆర్‌సీవో, డీసీవోలు హాజరుకావాలని సూచించారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యగా పరిగణిస్తామని సిబ్బందిని సెక్రటరీ సీతాలక్ష్మి హెచ్చరించారు. సమస్యలను విన్నవించుకోవడానికి కార్యాలయానికి వస్తే కూడా తప్పేనా అని చర్చించుకుంటున్నారు.

## లోకం పోకడ



తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి

## కాంగ్రెస్, బీజేపీ ఎజెండా ఒక్కటే

- కేసీఆర్ బద్నామే వారి పని
- ఆ పార్టీలకు పారపాటున ఓటేస్తే మనల్ని మనం దహించుకున్నట్టే
- పోటీ చేయడానికి అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నేతలకు టికెట్లు
- కోటీశర్వులను కాదు బిచ్చగాళ్లను చేయకుండా ఉంటే చాలు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలది ఒకటే ఎజెండా అని, కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడటమే వారి లక్ష్యమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. ఆ రెండు పార్టీలకు రాష్ట్రంలో సరియైన అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నేతలను చేర్చుకొని టికెట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు చేసిన మేలు గురించి చర్చకు సిద్ధమా? అంటూ అమిత్‌షాకు కేసీఆర్ విసిరిన సవాల్‌ను స్వీకరించకుండా తోక ముడిచారని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, అమిత్‌షా రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా కేసీఆర్ మీద నిందలు వేయడం తప్ప ఒక్కటీ నిరూపించలేదని పేర్కొన్నారు. బీజేపీ దేశవ్యాప్తంగా బలంగా ఉంటే, ఆ పార్టీకి అభ్యర్థులు ఎందుకు కరువయ్యారని ప్రశ్నించారు. దక్షిణ భారత్‌లో సమీప భవిష్యత్తులో బీజేపీ కీలకంగా వ్యవహరించే పరిస్థితిలేదని చెప్పారు. పోరపాటున కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే మనల్ని మనం దహించుకున్నట్టేనని హెచ్చరించారు. ఆ రెండు పార్టీలు దౌర్జన్యంతో రాష్ట్రాలు, ప్రాంతీయపార్టీల హక్కులను హరించే విధంగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. ఫెడరల్ స్ఫూర్తిని అంగీకరించకుంటే ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించడమేనని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని కాంగ్రెస్ చెప్పుకోవడం హాస్యాస్పదమని, కోటీశ్వరులను చేయడం సంగతి తరువాత, ప్రజలను బిచ్చగాళ్లుగా మార్చకుండా చూడాలని చురకలేశారు. గుడ్లు పీకి గోలీలు ఆడుతాం, తొండలు వదులుతాం, మానవబాంబులం అవుతామని ముఖ్యమంత్రి అనడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంత ఉబలాటంగా ఉంటే సినిమా తీసుకుని సంతోషపడాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ఎందుకు బీజేపీకి గులాంగిరి చేస్తున్నారని ప్రశ్నించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత ఏక్‌నాథ్‌షిండే వస్తాడంటూ బీజేపీ నేతలు లక్ష్మణ్, కిషన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని ప్రశ్నించారు. మోదీ వస్తే ఎందుకు వెళ్లి వంగి వంగి దండాలు పెడుతున్నారని, కేవలం నెల రోజుల్లో ఎన్నికలు పెట్టుకుని రేవంత్ ప్రధానిని ఎలా కలుస్తాడని కాంగ్రెస్ సీనియర్ నేతలే నిలదీస్తున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డికి చేతనైతే కేసీఆర్ కంటే ఎక్కువ పనిచేసి చూపించాలని సవాల్ చేశారు. నిందలు, బెదిరింపులు, వ్యక్తిగత దూషణలతో లాభపడతామని కాంగ్రెస్ నేతలు భావిస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు 2500 ఇచ్చి మాట్లాడు

- కోటిమందిని కోటీశ్వరులను చేయడం అసాధ్యం
- ప్రభుత్వానికి మాజీమంత్రి సత్యవతి రాథోడ్ సూచన
- మళ్లీ మోసం చేయడానికి కాంగ్రెస్ పన్నాగమని వ్యాఖ్య

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): మహిళలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటూ ఆచరణ సాధ్యం కాని హామీని ఇచ్చి మరోసారి మహిళలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆమె మీడియాతో.. మహిళలకు ప్రకటించిన 2,500 పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో, ఎంతమందికి ఇస్తారో చెప్పాలని సవాల్ చేశారు. పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళా సదస్సు ప్రభుత్వ కార్యక్రమమా లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా అని నిలదిశారు. చేతి గుర్తు ఉన్న బ్యాజ్జీలను మహిళలకు అందించారని చెప్పారు. సీఎంకి కేసీఆర్‌ను దూషించడం తప్ప మరో పనిలేదని మండిపడ్డారు. ఓడిపోయినా సిగ్గు రాలేదని రేవంత్‌రెడ్డి అంటున్నారని, గత పదేండ్లు కాంగ్రెస్ ఓడిందని, ఇప్పటికీ కేంద్రంలో, అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో లేదని, మరి ఆ పార్టీ నేతలకు కూడా సిగ్గురాలేదా అని తాము అనగలమని చెప్పారు. రేవంత్‌రెడ్డి భాషను ప్రజలందరు గమనిస్తున్నారని, కోటి కోట్లు ఎక్కడివని ఆమె నిలదీశారు. అసరా పింఛనును ఇంతవరకు 4 వేలకు పెంచలేదని, డబ్బు ఇచ్చే పథకాలను అమలు చేయడం లేదని, ఉద్దెర బేరం పథకాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. మహిళలు ఇప్పటికైనా ప్రభుత్వం చేస్తున్న మోసాలను గ్రహించాలని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గాలి అనిల్‌కుమార్. పక్కన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి

# మరో నలుగురు ఖరారు

మొదటిపేజీ తరువాయి...

అభ్యర్థులను ప్రకటిస్తున్నారు. చేవెళ్ల నుంచి మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నిజామాబాద్ నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, వరంగల్ నుంచి డాక్టర్ కడియం కావ్య (మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కుమార్తె) బరిలోకి దిగబోతున్నట్టు బుధవారం పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటికే ఖమ్మం (నామా నాగేశ్వరరావు), మహబూబాబాద్ (మాలోత్ కవిత), మహబూబ్‌నగర్ (మన్నె శ్రీనివాస్‌రెడ్డి), కరీంనగర్ (బోయినపల్లి వినోద్‌కుమార్), పెద్దపల్లి (కొప్పుల ఈశ్వర్) స్థానాలను ప్రకటించారు. ఈ 9 స్థానాల్లో మూడింటిని బీసీలకే కేటాయించడం విశేషం. జహీరాబాద్, నిజామాబాద్ స్థానాలను మున్నూరుకాపు, చేవెళ్లను ముదిరాజ్ సామాజిక వర్గానికి కేటాయించారు.

### వరంగల్ ముఖ్యనేతలతో కేసీఆర్ భేటీ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసంలో వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ముఖ్యనేతలతో బుధవారం సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నుంచి బరిలోకిదిగే అభ్యర్థి కోసం చర్చించారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు సహా ఇతర ముఖ్యనేతల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను పోటీచేయాలని కేసీఆర్ కోరారు. తన పేరును సూచించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన రమేశ్, తాను పోటీచేయలేనని, ఎవరిని ఉంచినా సహకరిస్తానని తెలిపారు. ఆ తర్వాత అందరి నిర్ణయంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, హన్మకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, పార్టీ నేతలు నాగర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్, మెట్టు శ్రీనివాస్, బొల్లం సంపత్‌కుమార్, ఎడవెల్లి కృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లావుల లలితా కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

### కేసీఆర్‌కు కృతజ్ఞతలు

తనకు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేసే అవకాశం కల్పించినందుకు గాలి అనిల్‌కుమార్ బుధవారం పార్టీ అధినేత కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనిల్‌కుమార్‌ను మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి అభినందించారు.

### బీఆర్ఎస్ ప్రకటించిన స్థానాలివే

| లోక్‌సభ స్థానం | అభ్యర్థి |
|---|---|
| ఖమ్మం | నామా నాగేశ్వర్‌రావు |
| మహబూబాబాద్ (ఎస్టీ) | మాలోత్ కవిత |
| కరీంనగర్ | బోయినిపల్లి వినోద్‌కుమార్ |
| పెద్దపల్లి(ఎస్సీ) | కొప్పుల ఈశ్వర్ |
| మహబూబ్‌నగర్ | మన్నె శ్రీనివాస్ రెడ్డి |
| చేవెళ్ల | కాసాని జ్ఞానేశ్వర్ |
| వరంగల్ (ఎస్సీ) | డాక్టర్ కడియం కావ్య |
| జహీరాబాద్ | గాలి అనిల్‌కుమార్ |
| నిజామాబాద్ | బాజిరెడ్డి గోవర్ధన్ |

## బీఆర్ఎస్-బీఎస్పీ కలిసే పోటీ

పోటీ చేసే స్థానాలపై త్వరలో స్పష్టత

కేసీఆర్‌తో బీఎస్పీ నేతలు రాంజీగౌతమ్, ప్రవీణ్‌కుమార్ చర్చలు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్-బీఎస్పీ కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. ఇరు పార్టీల మధ్య సయోధ్య కుదిరిందని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్ తెలిపారు. కలిసి పోటీచేసే స్థానాలపై పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతితో చర్చించిన తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. బీఎస్పీ పోటీచేసే స్థానాలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. బుధవారం సాయంత్రం నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో రాంజీగౌతమ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ సెంట్రల్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానందరావు, ప్రధాన కార్యదర్శులు విజయ్ ఆర్య, కే ఈశ్వర్ తదితరులు చర్చలు జరిపారు. బీఆర్ఎస్-బీఎస్పీ మధ్య సీట్ల పంపకాలు, పోటీచేసే స్థానాలపై చర్చించారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి టీ హరీశ్ రావు, మాజీ ఎంపీ బాల్క సుమన్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఖాళీ బిందెలతో నిరసన

ఖమ్మం, మార్చి 13: జిల్లా కేంద్రంలో తాగునీటి సరఫరా నిలిచిపోయి పది రోజులైనా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక మహిళలు 25వ డివిజన్ గాంధీపార్క్ ప్రాంతం వద్ద బుధవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు ఇప్పటికైనా స్పందించి నీటిని సరఫరా చేయాలని వేడుకున్నారు.

# బెంగళూరు దుస్థితి మనకు రావొద్దు

హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ వద్ద ట్యాంకర్ల నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు

మొదటిపేజీ తరువాయి...

పాలకులు, అధికారులు మేల్కొనాలని ఆదేశించింది. నీటి వినియోగం, అమలు తీరుపై ఈ నెల 16లోగా నివేదిక అందజేయాలని ఆదేశించింది. హైదరాబాద్ -సికింద్రాబాద్ జంటనగరాల్లో తీవ్ర నీటి కొరత ఏర్పడిందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలంటూ పీఆర్ సుభాష్‌చంద్రన్ 2005లో రాసిన లేఖను హైకోర్టు పిటిషన్‌గా పరిగణించి విచారణ జరుపుతున్నది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఈ అంశంపై మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ లేఖ రాసే నాటికి ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవని ప్రభుత్వం చెప్పడంతో హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇదేమీ ప్రభుత్వ వ్యతిరేక వ్యవహారం కాదని తేల్చి చెప్పింది. నీరు ప్రజలకుచెందిన నిత్యకృత్యమని స్పష్టం చేసింది. నీటిని రీసైక్లింగ్ ద్వారా వాడుకునేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. రీసైక్లింగ్ ప్లాంట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని పేర్కొంది.

### ఇంకుడుగుంతలు పరిశీలించాలి

భవన నిర్మాణాలన్నింటినీ పరిశీలించి ఇంకుడు గుంతలు లేనివాటిని గుర్తించాలని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలనే నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శికి ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి ఇంటి యజమానికి కనీసం 6 మొక్కలు సరఫరా చేయాలని గుర్తుచేసింది. మొక్కలను నాటిన తర్వాత వాటి సంరక్షణ బాధ్యత ఇంటి యజమానిదేనని, విఫలమైతే ఆస్తి పన్నుతో సమానంగా జరిమానా విధించాలని గుర్తుచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బోర్లు వాల్టా చట్ట నిబంధనలకు లోబడి ఉన్నాయో లేదో భూగర్భ జల శాఖ అధ్యయనం చేసి నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వర్షపు నీటిని ఒడిసి పుచ్చుకోవాలని తెలిపింది.

### 'వాల్టా' అమలుకు చర్యలు తీసుకోవాలి

బిల్డింగ్ నిబంధనలకు సవరణ చేస్తూ గత ఏడాది మార్చి 31న జారీ చేసిన జీవో అమలుకు తీసుకున్న చర్యలపై నివేదిక అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2002 వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ (వాల్టా) లోని 11వ సెక్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని, భూగర్భ జలాల రక్షణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పింది. భూమి నుంచి నీటిని తోడటం మాత్రమే కాదు.. ఆ భూమిలోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బోర్లు బావులు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. నీటి సంరక్షణ, పంపిణీని 3 నుంచి 5వ తరగతి అవసరమైతే 8వ తరగతి విద్యార్థుల వరకు పాఠ్యాంశం చేసే విషయాన్ని పరిశీలించాలని సూచించింది. నీటి సంరక్షణకు జారీచేసిన ఆదేశాల అమలుకు వాచ్‌డాగ్ కమిటీలను ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఆదేశించింది.

### ప్రభుత్వ తీరుపై అసహనం

హైకోర్టు.. గతంలో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ, ప్రభుత్వ కౌంటర్ పిటిషన్లు, కోర్టు సహాయకుడిగా (అమికస్ క్యూరీ) నియమితులైన సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి సమర్పించిన నివేదికలను పరిశీలించింది. 2005 తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులు ఇప్పుడు లేవని, అయినా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని ప్రకాశ్‌రెడ్డి చెప్పారు. నీటి సంరక్షణకు ఆయన పలు సూచనలు చేశారు. 2005 నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చెప్పడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. నీటి ఎద్దడి బెంగళూరులో ఎంతగా ఉందో చూస్తే తెలుస్తుందని, నీరు నిత్యావసర అంశమని గుర్తుచేసింది. సమస్యను తీవ్రంగా పరిగణించాలని చెప్పింది. ఇదేదో ప్రభుత్వ వ్యతిరేక వ్యవహారమని భావించకూడదని హితవు పలికింది. అమికస్‌క్యూరీ ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించింది. తమ ఆదేశాల అమలుపై నివేదిక సమర్పించాలని ప్రభుత్వం తరపున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్‌ను కోరింది. విచారణను 16కు వాయిదా వేసింది.

## పంటలకు దేవుడే దిక్కు

మొదటిపేజీ తరువాయి...

తోటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో చాలా దుర్భర పరిస్థితులు ఉన్నాయని, తాగడానికి కూడా నీరు లేదని తెలిపారు. నల్లగొండ జిల్లాకు నిత్యం 18 ఎంఎల్‌డీల నీరు అవసరం కాగా, ప్రస్తుతం 26 ఎంఎల్‌డీలు అందజేస్తున్నా సరిపోవడం లేదని చెప్పారు. ప్రజలు నీటిని వృథా చేయవద్దని సూచించారు. కృష్ణా నదిలోనే నీరు లేదని, కర్ణాటక నుంచి తాగునీటిని తీసుకొచ్చేందుకు త్వరలోనే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలువనున్నామని ఆయన తెలిపారు. మూడు నెలలపాటు ప్రజలు, అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజల కోసం అవసరమైతే ట్యాంకర్లను వాడాలని, నిధుల విషయంలో ఇబ్బంది పడవద్దని అధికారులకు సూచించారు.

## పీఆర్ ఈఎన్‌సీగా కనకరత్నం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్- ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ)గా వీ కనకరత్నం నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులిచ్చారు. ఇప్పటివరకు ఈఎన్‌సీగా ఉన్న సంజీవరావు గతంలో పదవీ విరమణ చేసినా ఆయనను కొనసాగించారు. రిటైర్డ్ అధికారులను తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కొత్త వారికి అవకాశం ఇచ్చినట్టుగా సమాచారం. కనకరత్నం 1989లో సర్వీసులో చేరారు. ఆయన ఇప్పటి వరకు సీఈ( టెక్నికల్)గా పని చేశారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయనకు పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

## సీఎం ఇలాకాలో నీటి గోస

- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ప్రజలు
- పది రోజులుగా నీళ్లులేక గగ్గోలు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిత్యం భగీరథ నీరు

మద్దూరు, మార్చి 13: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ నియోజకవర్గంలో తాగునీటి కోసం ప్రజలు తండ్లాడుతున్నారు. కొద్దికాలంగా సమస్య వేధిస్తున్నప్పటికీ పది రోజులుగా మరింత తీవ్రం కావడంతో మద్దూరు మండలం దోరేపల్లివాసులు ధర్నా చేపట్టారు. 985 ఇండ్లు, 5 వేల జనాభా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకా పల్లెలోనే నీటి కోసం ప్రజలు అరిగోస పడుతున్నారు. ఇలాగైతే లాభం లేదని బుధవారం గ్రామస్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. మద్దూరు-కోస్గి ప్రధాన రహదారిపైకి చేరుకుని ఖాళీ బిందెలతో బైఠాయించారు. నీటి కోసం అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే ముందుముందు ఇంకెలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ పైప్‌లైన్ పది రోజుల క్రితం పగిలిపోయింది. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో గ్రామానికి నీటి సరఫరా బంద్ అయింది. గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నా, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో చివరికి రోడ్డెక్కి నిరసనకు దిగారు. కేసీఆర్ హయాంలో తామెప్పుడూ ఇలా రోడ్డెక్కలేదని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజులకే తాగునీటి కోసం నిరసన చేయాల్సిన దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, అధికారుల జోక్యంతో చివరికి గ